క్లుప్తంగా

కేజీబీవీ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తూరు: మండలంలోని వసప గ్రామంలో గల కేజీబీవీని సర్వశిక్ష అభియాన్ జీసీడీఓ వి.ఉమ, జిల్లా కో ఆర్డినేటర్ బి.గోవిందరావు గురువారం పరిశీలించారు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు కేజీబీవీ ఎస్‌ఓ పనితీరు బాగు లేదంటూ ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. పలు పత్రికల్లో వచ్చిన వార్తలపై ఏపీసీ స్పందించారు. కేజీబీవీని పరిశీలించి నివేదిక అందజేయాలని జీసీడీఓను ఆదేశించారు. బియ్యం నిల్వలు, పలు రికార్డులతోపాటు వంట శాల, భోజనాలను జీసీడీఓ పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలను నమోదు చేశారు. నివేదికను ఏపీసీకి అందజేస్తామని జీసీడీఓ తెలిపారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ మండల అధ్యక్షుడు పైడి రమణ

ఆమదాలవలస: ఎంటీఎస్ (మినిమం టైమ్ స్కేల్) ఉపాధ్యాయుడు అల్లు రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని డీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు పైడి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమదాలవలసలో గురువారం మాట్లాడారు. జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయునిగా పనిచేసిన రాజును కంచిలి మండలం జి.ముకుందపురం పాఠశాలకు బలవంతంగా బదిలీ చేయడంతోనే మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందారన్నారు. 2023 ఏప్రిల్ 13న విధుల్లో చేరిన రాజు అకాల మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడిందన్నారు. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రతినెలా కనీసం రూ.20 వేల పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎరువుల షాపుల తనిఖీ

బూర్జ: మండలంలోని కొల్లివలస, ఉప్పినివలస, కె.కె.రాజపురం, బూర్జ గ్రామాల్లో ఉన్న ప్రైవేట్ ఎరువులు, పురుగు మందుల షాపులను ఏఓ డి.ఉషారాణి, డీటీ బి.సత్యవతి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నడక మార్గంలో ఇంటి నిర్మాణం!

- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



దళితులు నడిచే మార్గంలో నిర్మిస్తున్న ఇల్లు

సారవకోట: మండలంలోని మదనాపురంలో దళితులు నడిచే మార్గంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై తహసీల్దార్, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని దళితులు ఆరోపిస్తున్నారు. 12 కుటుంబాలకు చెందిన దళితులు గ్రామంలోని ప్రధాన వీధికి వచ్చేందుకు ఎప్పటి నుంచో ఉన్న మార్గంలో ఆ గ్రామస్తుడు దౌర్జన్యంగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. దీనిని మండల స్థాయి అధికారుల దృష్టికి దళితులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు గ్రామానికి వెళ్లి పరిశీలించి హడావిడి చేశారు. స్థానిక అధికార పార్టీ నాయకుల నుంచి ఫోన్లు రావడంతో తిరుగుముఖం పట్టారు. ఇంటి నిర్మాణం చేపడుతున్న స్థలం గ్రామ కంఠమైనప్పటికీ నిర్మాణదారుడికి ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. స్థానిక పెద్దల సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలని సూచించడం శోచనీయం. తాము ఎన్నో ఏళ్ల నుంచి నడకతోవగా వాడుతున్న స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టడం, దీనికి అధికార పార్టీ నాయకులు వంతపాడటంపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తాము పోరాటం చేస్తామన్నారు.

17 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ పరిధి గణేష్‌నగర్‌లో ఓ మహిళ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 17 మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు ఎస్ఐ సీపాన కాంతారావు గురువారం తెలిపారు. సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టామన్నారు. మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోసం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు



ఆమదాలవలస: వెంకయ్యపేటలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: ప్రజలను మోసం చేయడం, సంక్షేమ పథకాల్లో కోతవేయడం సీఎం చంద్రబాబు నాయుడు నైజమని, ప్రజలు ఇది గుర్తించాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాల్టీలోని 23వ వార్డు వెంకయ్యపేటలో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో టీడీపీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ఉన్న అన్ని పథకాలనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్యూ ఆర్ కోడ్‌ను చూపిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లిరాజు, కూన రామకృష్ణ, పొన్నాడ చిన్నారావు, దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవిరావు, డి.శ్రీనివాసరావు, నున్నగాపులు చిన్నారావు, బి.వి.రమణమూర్తి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే సీఎం చంద్రబాబు అజెండా అని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని వైకుంఠపురం గ్రామ పంచాయతీ వైకుంఠపురం, బొడ్డపాడు గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు.



పోలాకి: గుల్లవానిపేటలో క్యూ ఆర్‌కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జలుమూరు: అక్కురాడలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తోన్న ఎంపీపీ గోపి, నాయకులు

నరసన్నపేట మండలంలో..

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలకు మోసం చేస్తోందని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మండలంలోని గోపాలపెంట, పోతయ్యవలస పంచాయతీల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, గోపాలపెంట సర్పంచ్ యండ కృష్ణవేణి, ఎంపీటీసీ గదిలి మల్లేశ్వరరావు, పోతయ్యవలస సర్పంచ్ కనపల సత్యప్రియ, పార్టీ నాయకులు రాజాపు అప్పన్న, లుకలాపు రవి, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు, బగ్గ రమణయ్య, కనపల శేఖరరావు, నేతింటి రాజేశ్వరరావు, సతివాడ రామినాయుడు, తోట బార్గవ్, తోట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరా వు, మామిడివలస ఎంపీటీసీ గుమ్మడి రాంబాబు, సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం, నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, జల్లు బలరాంనాయుడు, మజ్జి నర్సింగరావు, పి.సునందన, పి.రామచంద్రరావు, కింజరాపు ఆనందరావు, ఎం.మోహన్‌రావు, ఈశ్వరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



నరసన్నపేట: గోపాలపెంటలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, నాయకులు

పోలాకి మండలంలో..

పోలాకి: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేసిందని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు అన్నారు. గురువారం మండలంలోని తీరప్రాంత గ్రామాలైన కొత్తరేవు, గుల్లవానిపేట, గుప్పెడుపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, నాయకులు లండ యర్రయ్య, అడ్ల శ్రీను, మిత్తన శ్రీనివాసరెడ్డి, చింతాడ ఉమామహేశ్వరరావు, రెంటికోట త్రినాథరావు, చింతు రాఘవరావు, పైల మల్లేసు, సుంకరి రాంబాబు, కణితి సత్తిబాబు, గుంటు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు మండలంలో..

జలుమూరు: సీఎం చంద్రబాబు జీవితం అంతా మోసాలమయమేనని ఎంపీపీ వాన గోపి అన్నారు. గురువారం మండంలోని అక్కురాడ, యలమంచిలి గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, ధర్మాన జగన్, మెండ రవి కుమార్, బోర రామకృష్ణ, పి.విజయ్, బి.వి.రమణ, రామ్మూర్తి నాయుడు, కర్రి అయ్యప్ప, వాన నాగేశ్వరరావు, పి.రాజప్పలనాయుడు పాల్గొన్నారు.



బూర్జ: వైకుంఠపురంలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

కార్డెన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను ప్రదర్శిస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని తోటవాడ పంచాయతీ రాజుపేటలో ఎస్ఐ ఎం.ప్రవల్లిక ఆధ్వర్యంలో గురువారం ఉదయం పోలీస్ సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం అక్రమ నిల్వలు, విక్రయాలు, నిషేధిత పదార్థాలతో పట్టుబడితే చట్టరీత్యా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అపరిచిత వ్యక్తులు తారసపడితే తెలియజేయాలని సూచించారు.

ఆక్రమణలపై ఫిర్యాదు



డీటీ మురళీధరరావుకు ఫిర్యాదు అందజేస్తున్న చిట్టివలస, గాజులకొల్లివలస యువకులు

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస పరిధిలో గల సంఘమేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టి, ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులను చిట్టివలస గ్రామానికి చెందిన యువకులు కోరారు. గురువారం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ హనుమంతు మురళీధరరావుకు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. గత పది రోజులుగా ప్రభుత్వం స్థలంలో పాకలు వేస్తూ, మొక్కలు నాటుతున్నారని వివరించారు. గ్రామస్తులు ఎవరైనా ప్రశ్నిస్తే తప్పుడు సర్వే నంబర్లున్న డీ పట్టాలు చూపిస్తున్నారని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి, ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరారు. యువకులు బోగి నాగరాజు, బంటుపల్లి కూర్మారావు, చిన్నారావు, నవిరి శ్రీనివాసరావు, పెద్దిన సూర్యనారాయణ, బొబ్బాది గిరిబాబు, లక్ష్మణరావు, తదతరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై విచారణ

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ పద్మలత గురువారం విచారణ చేపట్టారు. రాష్ట్ర విద్యాశాఖాధికారులకు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు కేజీబీవీ ఎస్ఎంసీ చైర్మన్ కిరణ్‌కుమారి, వైస్ చైర్మన్ పారన్నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. కేజీబీవీ రికార్డులు, ఖర్చులకు సంబంధించిన చెక్కులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ సౌమ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిస్థితిలపై సిబ్బందితో, పాఠశాలలో వసతులు, భోజన సదుపాయాలపై విద్యార్థులతో మాట్లాడారు. ఎటువంటి వివాదాల్లోకి విద్యార్థులను తీసుకురావద్దని కేజీబీవీ సిబ్బందికి హెచ్చరించారు. విద్యార్థులకు చక్కని బోధన అందించాలని సూచించారు. సంబంధిత విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు డిప్యూటీ కలెక్టర్ తెలిపారు.



ఉపాధ్యాయులను విచారిస్తున్న డిప్యూటీ కలెక్టర్

బూరగాం ఫీల్డ్ అసిస్టెంట్‌పై..

పాతపట్నం: మండలంలోని బూరగాం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కుమారి పుల్లాయ్ అక్రమాలకు పాల్పడ్డారంటూ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్వామా పీడీ బి.సుధాకరరావు విచారణ చేపట్టారు. గురువారం బూరగాం గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ పి.చంద్రకుమారి సమక్షంలో గ్రామసభ నిర్వహించి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది, పోలీసులు జోక్యంతో సద్దుమనిగింది. ఉపాధి పనులకు వెళ్లకుండా ఫీల్డ్ అసిస్టెంట్ భర్త కృష్ణపుల్లాయ్ పేరుతో డబ్బులు జమ అవుతున్నాయని, జాబ్ కార్డులకు, ఉపాధి పని కల్పించడానికి డబ్బులు అడుగుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు ఇచ్చారు. వేతనదారులు ఒక్కొక్కరిని పీడీ పిలిచి విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై నివేదిక తయారు చేసి, ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పీడీ తెలిపారు. హెచ్ఆర్ మెనేజర్ శ్రావణ్, ఏపీఓ సురేష్, ఎస్ఐ బి.లావణ్య, సర్పంచ్ బిజిలి పుల్లాయ్, లోలుగు నర్సునాయుడు, ప్రహల్లాద్ పుల్లాయ్, రామారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పాతపట్నం: వేతనదారులను విచారిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

శక్తియాప్‌తో మహిళలకు రక్షణ

పొందూరు: శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంలా పనిచేస్తుందని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ అన్నారు. పొందూరు మండలంలోని బాణాం గ్రామంలో గురువారం నారీశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతీ మహిళ తప్పనిసరిగా శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

- ఇసుక, మైనింగ్, లిక్కర్ అక్రమ రవాణాలో ఎమ్మెల్యే కూన రవికుమార్ దిట్ట
- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ బహిరంగా చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవి కుమార్ సవాల్ విసిరారు. గురువారం ఆమదాలవలసలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్లతో చింతాడ మట్లాడారు. ఇసకాసురుడిగా రాష్ట్రంలో కొన్నేళ్ల క్రితమే ఎమ్మెల్యే కూన పేరు పొందారన్నారు. ప్రస్తుతం ఆమదాలవలస నియోజకవర్గంలో పది అక్రమ ఇసుక ర్యాంపులు, లిక్కర్ దందా, అక్రమ మైన్స్ ద్వారా ప్రతిరోజూ లక్షల్లో అక్రమ ఆదాయం సంపాదిస్తున్నారని, వీటికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని, వీటిపై బహిరంగా చర్చకు ఎమ్మెల్యే రావాలన్నారు. కొంతమంది టీడీపీ కార్యకర్తలు ప్రెస్ మీట్‌లు పెట్టి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అక్రమాల చిట్టా తమ దగ్గర ఉందని, బహిరంగ చర్చకు ఆయనను తీసుకురాగలరా అని ప్రశ్నించారు. అక్రమ ఇసుక ర్యాంపుల్లో పది పైసలు వాటా దిగువ స్థాయివారికి అందుతుంటేనే నెలకు రూ.లక్షల్లో ఆదాయం వస్తోందని, అటువంటిది ఎమ్మెల్యేకు కోట్లలో ఆదాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని టీడీపీ కార్యకర్తలు గ్రహించకుండా మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇసుక ర్యాంపుల వద్ద అక్రమార్జన చేసినవారికి పర్యావరణ పరిరక్షణ, ఇసుక ర్యాంపులకు కావాల్సిన అనుమతులు వంటి వాటిపై అవగాహన లేదన్నారు. కేవలం జేసీబీలు, ట్రాక్టర్‌లు, లారీల లెక్కలు మాత్రమే వారు చూసుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేకే ఇసుక ర్యాంపుల నిర్వహణపై అవగాహన ఉందని, అందుకే ఆయననే బహిరంగ చర్చకు రమ్మంటున్నామన్నారు. ఎమ్మెల్యేకు లిక్కర్, ఇసుక, మైనింగ్ ద్వారా ప్రతిరోజూ లక్షల్లో ఆదాయం రావడం లేదని ఆమదాలవలస పట్టణ గ్రామ దేవతపై ఒట్టువేసి, దీపం వెలిగించి చెప్పగలరా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు లేనిపోని మాటలు ఆడటం సరికాదని, తాను అన్ని ఆధారాలతో మాట్లాడుతున్నానని చింతాడ అన్నారు.

కృష్ణదాస్‌ను విమర్శించే స్థాయి టీడీపీ కార్యకర్తలకు లేదు..

తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను విమర్శించే స్థాయి టీడీపీకి కార్యకర్తలకు లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ అన్నారు. చింతాడ రవికుమార్ అర్హతలపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రతిరోజూ మాట్లాడుతున్నారని, ఎమ్మెల్యేకు ఉన్న అర్హతలు అందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో ఎంతో మందిని రాజకీయ అనుభవం లేకుండానే ఎమ్మెల్యేలుగా ప్రజలు ఎన్నుకున్నారని గుర్తుచేశారు. నారా లోకేష్‌కు గతంలో ఏం రాజకీయ అనుభవం ఉందని మంత్రిని చేశారని ప్రశ్నించారు. చింతాడ రవికుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఆమదాలవలస శ్రీకాకుళం (రోడ్) రైల్వే స్టేషన్‌లో ఉన్న గూడ్స్ షెడ్‌కు సంబంధించి మార్పు చేస్తున్నట్లు వచ్చిన జీఓ కాపీని బహిరంగంగా చూపించారు. దీన్ని దూసి రైల్వే స్టేషన్‌కు తరలిస్తే కార్మికులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు దుంపల శ్యామలరావు, బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, సరుబుజ్జలి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, ఆమదాలవలస మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, వివిధ విభాగాలకు చెందిన నాయకులు కొప్పల ఈశ్వరరావు, అజయ్‌కుమార్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులూ జాగ్రత్త

- వర్షా కాలంలో పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- టీకాలతో పశు మరణాల నివారణ



హిరమండలంలో దూడకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి రాజశేఖర్

హిరమండలం: వర్షాకాలం వస్తుందంటే అందరికీ భయమే. మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు తప్పదు. వ్యవసాయాధారమైన పాతపట్నం నియోజకవర్గంలో పాడి సంపదపై ఎక్కువ మంది ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. బ్యాక్టీరియా (సూక్ష్మజీవుల) ద్వారా జ్వరం, జెబ్బ వాపు, గొంతువాపు, తదితర వ్యాధులు వర్షా కాలంలో ప్రధానంగా వస్తాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తొలకరిలో ఇది ఎక్కువగా సోకుతుంది. గొంతువాపు సోకిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరిగి కంటి నుంచి నీరు, నోటి నుంచి చొంగ కారుతుంది. గొంతు, మెడ వాపు, శ్వాస కష్టమై, గురక శబ్దంతో వస్తూ 24 గంటల వ్యవధిలో పశువు మరణిస్తుంది. నివారణకు వ్యాధి నిర్ధారణ త్వరగా చేయాలి. రక్త పరీక్షల ద్వారా వ్యాధికారక బైపోలార్ బ్యాక్టీరియాను గుర్తించి నిర్ధారిస్తున్నారు. పశువుకు శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు మాత్రమే బ్యాక్టీరియా కనిపిస్తుంది.

పాతపట్నం నియోజకవర్గంలో..


పాతపట్నం నియోజకవర్గంలో పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట మండలాల్లోని 65 వేలకు పైగా పశువులున్నాయి. ఆయా మండలాల్లోని పశు వైద్యులు, సిబ్బంది సీజనల్ వ్యాధులపై పాడి రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో పాడి పశువుల వివరాలు

మండలం	పశువులు
పాతపట్నం	18,256
హిరమండలం	7938
కొత్తూరు	12,853
మెళియాపుట్టి	17,368
ఎల్.ఎన్.పేట	12,186

నివారణ చర్యలు ఇలా..

వర్షా కాలంలో పశువులకు వచ్చే గొంతువాపు వ్యాధి చికిత్సను హిరమండలం పశు ఆస్పత్రి వైద్యురాలు జి.కవిత వివరించారు. గొంతువాపు చికిత్సకు ఎన్నో రకాల మందులు, యాంటీ బయోటిక్స్, ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పశువులకు గొంతువాపు సోకే ప్రాంతాల్లో తొలకరిలోనే ముందు జాగ్రత్తగా పశువులన్నింటికీ టీకాలు వేయిస్తే 7 నుంచి 10 రోజుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. 6 నుంచి 12 నెలల వరకు వ్యాధి రాకుండా ఉంటుంది. గొంతువాపు వ్యాధి ఉన్న సమయంలో టీకా వేయకూడదన్నారు. అంటువ్యాధి కావడంతో ఇతర పశువులకు దూరంగా ఉంచాలన్నారు.



టీకాలు వేస్తున్నాం



వర్షా కాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు వస్తుంటాయి. ప్రస్తుతం పశువుల్లో జర్వం కనబడుతుంది. వాటికి టీకాలు వేస్తున్నాం. ప్రస్తుతానికి గొంతువాపు, జెబ్బ వాపు వ్యాధి ఇంకా రాలేదు. వచ్చినట్లు అయితే తక్షణమే తమను సంప్రదించాలి.

– ఐ.రాజశేఖర్, పశువైద్యాధికారి, హిరమండలం

చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఉమాసోమేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: స్థానిక పెద్దపేట రోడ్డులోని ఉమాసోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ బహుళ అమావాస్య పురస్కరించుకుని గురువారం 150 మంది మహిళలు కుంకుమ పూజలు చేశారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అమ్మవారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నరసన్నపేట: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించాలని వ్యవసాయశాఖ ఏడీ వెంకటమధు అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వీఏఏలు, వీహెచ్ఏలకు ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని, రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయమే మేలని అన్నారు. నేల ఆరోగ్యం, పర్యావరణ కాలుష్యం లేకుండా ఖర్చులు తగ్గించుకొని వ్యవసాయం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పటికే పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఏటీఎం ఏ గ్రేడ్ మోడల్, కషాయాలు, ద్రావణాలు గురించి ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ వివరించారు. యూనిట్ ఇన్‌చార్జి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

శిథిల పాఠశాలల పరిశీలన



వంశధార కాలనీలో శిథిల తరగతి గదులను పరిశీలిస్తున్న ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్...

నరసన్నపేట: మండలంలో శిథిలావస్థలో ఉన్న వంశధార కాలనీ, బుచ్చిపేట, కొత్తపోలవలస ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ దాలినాయుడు గురువారం పరిశీలించారు. సాక్షిలో ఈ నెల 21వ తేదీన ‘బిక్కుబిక్కుమంటూ’ అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శిథిల పాఠశాలల పరిస్థితిని స్వయంగా చూసి అధికారులకు నివేదిక పంపారు. బుచ్చిపేటలో తరగతి గదుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. వంశధార కాలనీ స్కూల్‌ను వంశధార డివిజన్ కార్యాలయ పరిసరాల్లో ఖాళీగా ఉన్న గదుల్లోనికి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వంశధార అధికారులు అంగీకరించి గదులను చూపిస్తే వాటిని పరిశుభ్రం చేసి తాత్కాలిక పద్ధతిలో వినియోగించుకొనేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తపోలవలసలో భవనం అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.